బొమ్మల కొలువు

వై. సాంబశివరావు

•••

నాన్నా బొమ్మలు తెచ్చేవా?

లేదమ్మా! రేపు తెస్తాను తల్లీ.

ఎప్పుడూ అలాగే అంటావుకానీ. రోజూ రేపు రేపంటావు.

రేపు తప్పకుండా తెస్తానుకాదూ.

అందరూ బొమ్మలు పెట్టుకుంటున్నారూ - నాకో బొమ్మైనాలేదు. నాకు కృష్ణుడిబొమ్మలూ, రైలుబొమ్మలూ, మారీ, మోటారుకారులూ, ఇంకా ఏంటే అమ్మా, అదోలాగ వుంటుంది, ఇంత వుంటుంది, కడుపునొక్కితే కీచుమంటుంది, వాళ్లింటో చూసేం.

అమ్మ—దొరసాని పిల్లబొమ్మా! కొని తెస్తారులే.

బిడ్డ—ఆ! అది. ఇంకా - అన్నీతే నాన్న - ఎంచక్క చిన్నకొలువు పెడతాను. పేరంటాళ్లని పిలుస్తాను.

నాన్న—అమ్మా! ఇలారా! ఓ చిన్న ముద్దియ్యి. వెర్రితల్లి. వాళ్లింటోలాంటి బొమ్మలు మనకెలా వస్తాయి? వాళ్లు గొప్పవాళ్లు. మనం......

అమ్మ—అబ్బా ఊరుకుందురూ. దాని కూడా చెప్పడం ఎందుకు మనగొడవలు. సరేనమ్మా అంటే తీరిపోయె. దాన్నేనా సంతోషంగా వుండనీండి.

బిడ్డ — మనంకూడా గొప్పవాళ్లమే నాన్నా. మరి నువ్వు బొమ్మలు తెత్తావు కాదు.

నాన్న — తెస్తానమ్మా. పోయి ఆడుకో (ముద్దుపెట్టుకుని పంపించేస్తాడు.)

భార్యాభర్తలు వెర్రిమొగాలతో నొకరినొకరు చూచుకుంటూనే కళ్లంట నీళ్లు కారుస్తారు. ఒకళ్లకళ్లు ఒకళ్లుతుడుచుకుని ఓదార్చుకుంటారు. అతను బి. ఏ. నిరుద్యోగి - ఆస్తి సున్న. బంధువులు చేరనియ్యరు. రోజు లెలా గడుస్తున్నాయో పెరుమాళ్లు కెరుక. వారు తిన్నా మానినా, వాళ్ల బిడ్డలకిమాత్రం నేటివరకూ పస్తుమాత్రం లేదు. పిల్లలు భోంచేస్తేనే వాళ్లకి కడుపునిండేది. ఒకరి

పొట్టలో ఒకరు ఇరుక్కు పడుక్కుని ఆకలి మృచ్ఛిలి కెడ మాయకుండా కాలక్షేపం చేస్తూవుంటారు. "శ్యామా! ఇలా ఎన్నాళ్లు" అంటా డాయన. వేడినిట్టూర్పే సమాధానం.

"ఇంత విశాలమైన భూమిలో మనకి తావులేదంటావా? భూమి సన్నగిలిపోయిం దంటావా?"

"మనలాంటివా ళ్లెందరో" అంది శ్యామ.

"ఏమైనా సరే, మన ప్రేమ మరొకరికి ఉండదేమో"

"మనకి ఉన్నది. అదే నా సౌభా గ్యం. ఒహళ్ల మాట నా కెందుకు" అంది శ్యామ.

పండుగ. ప్రపంచ మంతా కలకల్లాడు తోంది. శ్యామలరావుఇల్లూ కళగానే వుంది. తప్పేలామాత్రం కాళీ. అయినా కల కలకి కారణం? వాటిబిడ్డల కలకలనవ్వే. అంతా ముచ్చటగా పంచభక్ష్యపరమాన్నా లూ భుజిస్తారు. శ్యామలరావుగా రింట్లో పస్తు - పిల్లాది పస్తు - ప్రపంచం అంతా బొమ్మలకొలువుతో నిండివుంది. శ్యామల రావుగా రింట్లో - మహాలక్ష్మిపీట - మట్టి ప్రమిదీ - నూనెదీపం- అంతే.

"యీ వేళ మాటేమిటి?" అన్నాడు శ్యామలరావు.

"పరమేశ్వరుడే శరణ్యం" అంది శ్యామల.

"వీధిలోకి వెళ్లివస్తాను. వేగిరం వస్తాను. వీలైతే మార్వాడీదగ్గర ఖాతాలు వ్రాసి ఒకరూపాయేనా తెస్తాను" అంటూ వెళ్లేడు శ్యామలరావు.

"నాన్నా బొమ్మలు. బొమ్మలు నాన్నోయ్" అంది కూతురు.

"మరచిపోలేదమ్మా" అన్నా డాయన.

మార్వాడీ పండుగ చేసుకుంటున్నాడు. రూపాయలకి పూజ కొట్టుకట్టేసేడు. శ్యామల రావు ఆశ అడుగంటింది. ఊరల్లా తిరిగేడు. పండుగపూట రూపాయలు మార్చమన్నారు. దీనుడై ఇంటికి రాబోతున్నాడు. "నాన్నా బొమ్మలు" అన్నమాటలు వినిపించేయి. బిడ్డ మీదప్రేమ ఉరకలువేస్తోంది. రివ్వున బజా రుకు మళ్లేడు. చిల్లిగవ్వైనా లేదు జేబులో. కుమిలిపోయినాడు. వ్యర్థంగా ఏడ్చేడు. కఠినుడైనాడు. తప్పొప్పులు తోచలేదు. యీవెధవప్రపంచానికీ, ధర్మానికీ బలాదూర్ అన్నాడు. బిడ్డకి ఒక్కబొమ్మైనా ఇయ్య లేని యీసన్యాసిది వ్యర్థపుబ్రతు కను కున్నాడు. "నేడే నాప్రథమతప్పిదం ప్రారం భం - నేడే అది ఆఖరుతప్పిదం" అన్నాడు. కండువాచిరుగు మడతల్లోకప్పి, కండువాతో పర్తుచిరుగుకప్పి, డాబుగా బొమ్మలదుకాణాల దగ్గరకివెళ్లి, మహా కొనేవాడిమల్లేనే బేరం చేస్తూ సమయంకనిపెట్టి దుకాణాని కోబొమ్మ చొప్పున సంగ్రహించేడు. ఆరుబొమ్మలు దొరికేయి. చాలని తిరిగివస్తున్నాడు. "మా

తల్లి సంతోషిస్తుంది, ఆడుకుంటుంది, చిన్న చిన్న చేతుల్తో కొలువుపెడుతుంది. మాకు ఆకలిపోతుంది, ఇదే మాపండుగ" అని అను కుంటూ రాబోతుంటే——

"ఆగు బద్మాష్ - చోరీ చేసేవా?" అన్నాడు బీటుకనిస్టేబు. శ్యామలరావు నిశ్చేష్టుడైనాడు. మాట్లాడకుండా ఆబొమ్మలు కనిస్టేబు చేతుల్లో పోసేడు. అతను శ్యామల రావును లాకప్ (Lock-up)లో వుంచేడు.

ఇన్స్పెక్టరు పార్థసారథి విచారణచేసి శ్యామలరావుకి ౪ రోజులు విడిశైదువేసేడు.

"ప్రథమతప్పిదం, క్షమించండి" అన్నా డు శ్యామలరావు.

ఇన్స్పె — ౪ రోజులు చుఃకనశైదు వేసేను, అనుభవించు.

శ్యా—బిడ్డమీద ప్రేమచేత చేసేను. భార్య, బిడ్డలు తల్లడిల్లుతూంటారు. ఇంట్లో బియ్యం లేవు. కనికరించి విడిచిపెట్టండి.

ఇన్స్పె—నీవంటిబిడ్డలతండ్రులు చాలా మంది వున్నారు. ఇంట్లో బియ్యం లేనప్పుడు ఇంటికి వెళ్లి ఏమి అఘోరిస్తావు? పండుగైతే మాత్రం ? పస్తేకాదూ. హాయిగా ఇక్కడే బాగుంటుంది. యీ నాల్గురోజులూ చక్ర వర్తిగారి అతిథివైనావు.

శ్యామ—ఆలు, బిడ్డలతో పడిన పస్తు నాకు పెద్దవిందుగా వుంటుంది. ఇల్లాలు నా కోసం పరితాపంపొందుతూ ఉంటుంది. రక్షిం చండి. ఎన్నడూ చెయ్యను.

పార్థసారథికి యీమాట లెంతో ఆశ్చ ర్యం కలిగించేయి. వా రంత అన్యోన్యమైన దంపతులేనా అని అతని ఆలోచన. శ్యామల రావుమాట లతనిహృదయానికి శూలాల లాగ తగిలి, వెనక తాను హింసపెడితే, తన పోరుపడలేక లేచిపోయిన తనభార్య రుద్రమ్మ మాట జ్ఞాపకం వచ్చి, "నీకు ఖైదులోవిందు; నాకు ఖైదుకంటె అధ్వాన్నమైన హోటల్లో విందు. మనం ఇద్దరం ఒక్కలాగే ఉన్నాం లే, పడివుండు" అని వెళ్లిపోయేడు.

శ్యామలరావుని నిలువెల్ల అగ్నిచుట్టి దహిస్తోంది. ఆలుబిడ్డలు కలలోలాగ కను పించుతున్నారు. "హా! శివా! శరణు! శరణు భవా" అని అప్రయత్నంగా తననోటివెంట దీనాలాపాలు వచ్చేయి. కొయ్యలాగవుండి తెప్పరిల్లి చూసేసరికి - శ్యామా, బిడ్డలు వచ్చివున్నారు అక్కడికి జరిగిన సంగతంతా తెలుసుకుని. శ్యామ ఏడుస్తోంది. శ్యామల రావు దుఃఖం ఆపుకున్నాడు. బిడ్డ అమాయి కంగా "నాన్నా! బొమ్మలు తెస్తానని చెప్పి ఇక్కడ కూచున్నావా? ఛీ! పోనీలే. బొమ్మ లూ లేవూ, కొలువూ లేదు" అంది. యీ మాటలకి భార్యాభర్తల గుండెల్లో బల్లేలు పొడుచుకుపోయేయి. శ్యామలరావు భార్యకి జరిగిన వృత్తాంతం చెప్పేడు. నాలుగురోజుల్లో వస్తాను, ఇంటికి వెళ్లండి. పస్తుపడుతూ బ్రతికి

వుంటే మిమ్మల్ని చూస్తాను. లేకపోతే మీతోపాటే నాకు దారి" అన్నాడు. కనిస్టేబు తొందరపెడుతున్నాడు. శ్యామ కదలనంటుంది. ఖైదుతలుపుల్లోంచి బిడ్డని అందుకుని చేతులుమాత్రం ముద్దుపెట్టుకుని "ఇంటికి వెళ్లు తల్లీ, వస్తాను" అన్నాడు శ్యామలరావు. "ఇప్పుడు రా" అంది. "అప్పుడే రాను, పనిచూసుకు వస్తా" నన్నాడు. "నువ్వు రాకపోతే నేను వెళ్ల" నని గుమ్మంలో కూచుని కూనిరాగాలు తీసింది బిడ్డ. శ్యామలరావు, శ్యామ ఆపిల్ల నిష్కళంకమైన ప్రేమ, అమాయికత్వం చూచి, ఏమిచేయాలో తెలియక పెద్దపెట్టు ఏడ్చేరు. కనిస్టేబు కళ్లు తుడుచుకున్నాడు. వాళ్లని కదలమని మళ్లీ చెప్పలేదు.

పార్థసారథి హోటల్లో విందారగిస్తున్నాడు. ఖైదీగొడవ తన కేల? పాయసం! వెర్మిసిల్లీ (సేమియా) పాయసం- కప్పులో పోసేడు అయ్యరు. నోటి కెత్తి త్రాగబోయేడు ఇన్స్పెక్టరు. పాయసంలా కనిపించలేదు. వానపాములతుట్టలావుందిఅంతా. పక్కవాడికిగిన్నె చూచేడు. నిక్షేపంగా వుంది. త్రాగలేక వదలివేసేడు. జిలేబీ విరవబోయేడు. వానాకాలంలో రోకలిబండలు ఒకదానొకటి చుట్టుకుని వున్నట్లుంది. అదీ తినలేకపోయేడు. "ఏమి" అంటే "ఏమి" అని అంతా అడిగే రతన్ని. కారణం చెప్పలేకపోయేడు. మనుష్యులంతా శ్యామలరావులా కనిపిస్తూ వచ్చి "ప్రథమతప్పు క్షమించండి" అంటూ ప్రార్థిస్తున్నట్టున్నారు. ఇన్స్పెక్టరు గ్రహించేడు. "ప్రథమతప్పు- స్వల్పవిషయం- కన్నకూతురి మీద ప్రేమ. నాకాభాగ్యంలేదు - ఇల్లాలితో పస్తు విందుట — నేనంత అదృష్టవంతుడను కాను - పాపం, కఠినశిక్ష వేసేను" అన్నాడు. కచేరీ చేరేడు. శ్యామ, శ్యామలరావు, చిన్నబిడ్డలు అక్కడే వున్నారు. జవాను గజగజ లాడేడు. శ్యామ వెలవెలబోయింది. బిడ్డ భయపడి ఏడ్చింది. శ్యామలరావు బిడ్డని బుజ్జగించేడు. ఈ దృశ్యం పార్థసారథి మనసును కలచివేసింది. అమరజ్యోతి తనహృదయంలో అంకురార్పణం అప్పుడే చేసింది. జైలు తలుపులు విప్పేడు. బిడ్డలు తండ్రిని కావలించుకున్నారు. శ్యామ భర్తని ఆలింగనం చేసుకోబోయి వెనక్కి జంకింది. శ్యామలరావు శ్యామను దగ్గరగా లాక్కుని పార్థసారథికి నమస్కారాలు చేస్తూ "కృతార్థులం. భగవంతుడు మిమ్మల్ని రక్షిస్తాడు" అంటూ వెళ్లిపోయేరు. దారిలో ఓకనిస్టేబు ఒకబుట్టనిండా బొమ్మలు తెచ్చి వాళ్లకిచ్చేడు.

శ్యామలరావుగారిప్పుడు డిప్యూటీసూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు అయినారు. బిడ్డకి ఇంటినిండా బొమ్మలే. నౌకర్ల ఇళ్లనిండా బొమ్మలే. శ్యామల కింకొకొడుకు పుట్టేడు. పేరు పార్థసారథి.